

# బురుజువీధి కథలు

## – కె.వి.రమణరావు



(వినగలిగితే భూగోళమ్మీద ప్రతి పదార్థమూ, ప్రతి ప్రదేశమూ కథలు చెబుతాయి. మరి, మా బురుజువీధీ అందుకు మినహాయింపు కాదు. మా బురుజువీధి చెప్పిన, చెబుతున్న కథలు నెలకొకటిగా మీ కోసం...)



# పండిత శిల్పి

"**విశ్వమూర్తి యింటిముందర** రెండుమూడు కార్లు కనబడ్డాయే, ఆయన పిల్లలుగాని వచ్చారా?" అనడిగా మా ఆవిడ కామేశ్వరిని, ఆరాత్రి భోంచేసాక బల్లదగ్గర ఇంటికి తెచ్చుకున్న ఆఫీసు పని చూసుకుంటూ.

"యేదో జాతీయస్థాయి సంస్థ ఆయనకు అవార్డు యిచ్చిందట. మామూలేగా. ఆయన నాకొద్దని తిరస్కరించాడట. నచ్చజెప్పడానికి ఆ సంస్థ అఫీసర్లు వచ్చారన్నారు" అంది కామేశ్వరి మంచమెక్కి కూర్చుని ఆవులిస్తూ.

"యింతకుముందుకూడా అయన తిరస్కరించాడుగదా, మళ్లీ యిచ్చారా? ఆయందొక చాదస్తం. అదే మనకిస్తేనా" అన్నా

"యిప్పుడిస్తున్నది వాళ్లుకాదు. వేరేవాళ్లట. అయినా తిరస్కరించే స్థాయిలోవున్న వాళ్లకే వస్తాయి. మనకెందుకొస్తాయి?" అని నాకు చురకవేసింది.

నేను పట్టించుకోకుండా నా పేపర్లు తిరగేస్తూనే "వేరేవాళ్లంటే? ఆయన తెలుగులో, సంస్కృతంలో వుద్దండ పండితుడు. దానికి సంబంధించిన వాళ్లే యిస్తారు" అన్నా.

“అదే నాకూ అర్థంకావడంలేదు. యీసారి అవార్డు వచ్చింది అయన హస్తకళలో చూపించిన ప్రతిభకంట. చెక్కల్తో గొలుసులు, దండలు, మువ్వలు అలాంటివేవో చేసార్ట. అవార్డు తీసుకోమని మీ పెద్దలు ఆయనమీద వొత్తిడి తెస్తున్నారట. ఐనా మా ఆడవాళ్లకు అలాంటివన్నీ చెబుతారా?" అంది కామేశ్వరి ఆవలింతల మధ్యలో.

"మనవీధిలో యెంతటి రహస్యాన్నైనా కనుక్కునే ‘వార్తల వనజమ్మ’క్కూడా తెలియలేదా? ఐనా తిన్నగా యేదీ చెప్పవుగదా" అన్నా. తనకి బాగా తెలిసినా సరిగ్గా చెప్పదు. మావీధి సంక్షేమసంఘ పెద్దలు ఆడవాళ్లను తక్కువగాచూస్తారని ఆమెకు కోపం.

“వనజమ్మతో లాభంలేదు. సమాచారాన్ని చేరవేస్తుంది, పరిశోధించి కనుక్కోలేదు. ఐతే యీలోపలే మా నెట్ వర్క్ ద్వారా మాకు తెలిసిపోతుందనుకో” అంటూ విషయం చెప్పకుండా ఆమె నిద్రలోకి జారుకుంది. మరుసటిరోజు మాఅఫీసుకు లోకల్ సెలవు కాబట్టి ఆయనదగ్గరికెళ్లి వివరాలు తెలుసుకోవాలనుకున్నాను.

విశ్వమూర్తి ఇల్లు బురుజువైపు కాకుండా మా వరసలోనే కచేరిసత్రం నుంచి మూడోయిల్లు. ప్రహరిగోడనుంచి బాగా లోపలికి పెంకుటిల్లు. ఇంటిముందు విశాలమైన ఖాళీస్థలంలో పూలచెట్లున్నా పెద్ద మామిడిచెట్టు కొట్టిచ్చినట్టు కనబడుతూంటుంది. పెంకుటింటిచుట్టూ వెడల్పైన వసారాలున్నాయి. ఎడమవైపు ముందువసారాలో ఆయన ఒక పక్కగా

కూర్చొని ఎప్పుడూ ఏదో చదువుకోవడమో రాసుకోవడమో చేస్తూ కనిపిస్తూంటాడు. నేను రోజూ ఆఫీసుకు వెళ్లేప్పుడు, వచ్చేప్పుడూ అదే దృశ్యం.

విశ్వమూర్తిది రుషిలాంటి ఆహార్యం. వెడల్పైన మొహం, వెనక ముడివేసిన తెల్లబడిన జుట్టు, చాతీదాటిన గడ్డం, చురుకైన కళ్లు, పొడవైన ముక్కు. సంస్కృత, తెలుగు భాషల్లో మంచిపండితుడు. ఆయన చాలాయేళ్లు మావూరి స్కూల్లో సంస్కృతం టీచరుగా పనిచేసాడు. ఐతే పిల్లలకి మార్కులమీద తప్ప భాషనేర్చుకోవడంమీద ఆసక్తి తగ్గిపోతూండడంతో ముందుగానే రిటైర్మెంటు తీసుకున్నాడు.

తమ సందేహాలు తీర్చుకోవడంకోసం ఆయనదగ్గరికి ఎక్కడెక్కడినుంచో పండితులు, పరిశోధన విద్యార్థులు వస్తూంటారు. ఈయన ఇల్లొదిలి ఎక్కడికీ వెళ్లడు. యూనివర్సిటీలో తెలుగుశాఖలో పనిచేస్తున్న నామిత్రుడొకడుకూడా వస్తూంటాడు. అతను చెప్పబట్టే నాకు విశ్వమూర్తి ప్రతిభగురించి తెలిసింది. ఆయనకు కొన్ని క్లిష్టమైన వ్యాకరణవిషయాల్లో లోతైన పాండిత్యముందని, కొన్ని పుస్తకాలు కూడా రాసాడని, అలావున్నవాళ్లు తక్కువగా ఉంటారని, నా మిత్రుడు చెప్పాడు. మా వీధి పెద్దలక్కూడా అతనంటే గౌరవం. అందుచేత అతనిగురించి ఎక్కువ మాట్లాడుకోం.

విశ్వమూర్తి కొడుకు భారవి స్కూల్లో నాక్లాస్మేటు. ప్రస్తుతం టౌన్లో తెలుగు లెక్చరరు. శనాదివారాలు వచ్చిపోతూంటాడు. అతని చెల్లెళ్లిద్దరికీ పెళ్లైపోయి వేరేవూళ్లల్లో ఉంటారు.

అఫీసు పని త్వరగా ముగించి పడుకున్నానుగాని నాకు నిద్ర పట్టలేదు. విశ్వమూర్తి గురించిన పాతసంగతులు గుర్తుకొచ్చాయి.

విశ్వమూర్తి ఇంటిముందువైపు ఒకమూలన పెంకులవసారాఉంది. అప్పుడప్పుడూ ఒక వడ్రంగి కుటుంబం అందులో ఉండేది. వీరాచారి అనే ఒక ముసలాయన, అతని ఇద్దరు కొడుకులు మామిడిచెట్టుకింద వడ్రంగంపనులు చేసుకునేవాళ్లు. వీరాచారిదీ, విశ్వమూర్తిదీ స్వంతవూరు ఒకటే, అదేకాక వాళ్లు స్నేహితులు. ఆ అనుబంధంతోనే విశ్వమూర్తి వాళ్లకి తమ పెంకులవసారా ఉచితంగా ఇచ్చాడని అంటారు. మావూర్లో అంతగా పనులురావడంలేదని ఏడాదికిందట వీరాచారి కొడుకులు టౌనుకు మారిపోయారని విన్నాను.

రెండేళ్లకిందట ఒకరోజు మధ్యాహ్నం ఒక పనిబడి విశ్వమూర్తి ఇంటికెళ్లాను. గేటు తీసుకుని లోపలికెళ్లగానే మామిడిచెట్టుకింద పొడవాటి బల్లమీద ఒకతను చెక్కదిమ్మల్ని చిత్రిక పడుతున్నాడు, చూస్తే విశ్వమూర్తి! వీరాచారి అతనికి మెళుకువలు నేర్పిస్తున్నాడు. వీరాచారికి డెబ్భైయేళ్లుంటాయి, సన్నగా పొడవుగా ఉంటాడు, తీక్షణమైన కళ్లు, మడతలు పడిన మొహం, తెల్లబడిన గడ్డం. మాజీసైన్యాధిపతిలాగుంటాడు.

"మీరేంటి యీపని చేస్తున్నారు?" అన్నా ఆశ్చర్యంగా.

"సరదాగా నేర్చుకుంటున్నాను. అబ్బో ఇందులో ఎంత కష్టముంది. అంతకు మించిన నిశితత్వముంది" అన్నాడు విశ్వమూర్తి తుండుగుడ్డతో చెమట తుడుచుకుంటూ.

"పండితుడైనా వేగంగా నేర్చుకుంటావున్నాడు. దీక్షగల మనిషి" అన్నాడు వీరాచారి.

విశ్వమూర్తి నవ్వి వీరాచారిని చూపిస్తూ "అంతా మా గురువుగారి చలవ" అన్నాడు.

నన్నుకూడా రోజూవచ్చి నేర్చుకోమననందుకు సంతోషించాను.

ఆతరువాతకూడా నాలుగైదుసార్లు నేను వెళ్లినప్పుడు విశ్వమూర్తి చెక్కపని చేస్తూ కనిపించాడు. చివర్లో ఇంట్లోనే తన పుస్తకాలగదిలో రకరకాల చెక్కముక్కలు ముందేసుకుని పనిముట్లతో కుస్తీ పడడటం గమనించాను. చుట్టూ నోటుపుస్తకాలు, స్కేళ్లు, పెన్సిళ్లు పడివుండేవి. ఆతరువాత నేనెప్పుడైనా రాత్రి ఆలస్యంగా ఇంటికొచ్చేప్పుడు ఆ నిశ్శబ్ధంలో విశ్వమూర్తి ఇంట్లోంచి సన్నగా చెక్కపని చేస్తున్న శబ్దాలు వచ్చేవి. యీయన సరదా శృతిమించినట్టుంది అనుకునేవాణ్ణి.

'ఇప్పుడీ అవార్డుకు, అప్పుడాయన చేస్తూండినదానికి సంబంధమున్నట్టే ఉంది' అనుకున్నాను. ఐనా అరవైయేళ్ల వయసులో, రెండేళ్ల సమయంలో ఆయన అంత కళ ఎలాసంపాయించాడన్నది అంతుపట్టకుండావుంది. ఆతరువాతెప్పుడో నాకు నిద్రపట్టింది.

మర్నాడు సాయంకాలం ఆయన ఇంటికెళ్లాను. మామూలుగావున్నట్టే వరండాలో కూర్చుని పుస్తకం చదువుకుంటున్నాడు. వీధిలో తోపుడుబండిలో పూలమ్ముతూ షావలి గట్టిగా అరుస్తున్నాడు. గుడిముందర కొబ్బరికాయలమ్మే బాలమ్మ వడివడిగా వెళ్తోంది, ఆమె వెనకాలే వాళ్లకుక్క పరిగెత్తుతోంది.

కుశల ప్రశ్నలయ్యాక అసలు విషయం అడిగాను.

"అవును, నేనేదో ఉబుసుపోక, మావీరాచారి సూచనలతో చెక్కల్తో కొన్ని వస్తువులు తయారుచేసాను. నాస్నేహితుడొక కాశీపండితుడు ఫోటోలు తీసి బొంబాయిలోవున్న ఇంగ్లీషు పత్రిక్కి పంపాడు. వాళ్లొకరోజు ఎవర్నో పంపి నన్ను ఇంటర్వ్యూ చేసారు. ఆతరువాత రంగుల ఫోటోలతోసహా దాన్నో వ్యాసంగా వేసారు. ఇదంతా గొలుసుచర్యలాగా జరిగింది, నా ప్రమేయమేమీ లేదు" అన్నాడాయన నవ్వుతూ.

"మరి అవార్డు?" అనడిగా

"అదీ అంతే. ఆ వ్యాసాన్ని నీలాంటి పరోపకారెవడో చూసి ఆసంస్థ దృష్టికి తెచ్చాట్ట. వాళ్లొచ్చి ఏదో జాతీయ అవార్డిస్తామని, బొంబాయిరావాలని ఒకటే పోరు. 'ఏదో ఖాళీగా ఉండలేకచేసాను బాబూ, అవార్డులూ అవీ నాకు పడవు, దేశంలో ఎంతోమంది గొప్ప కళాకారులున్నారు, వాళ్లకిస్తే బావుంటుంద'న్నాను" నిర్లిప్తంగా అన్నాడు.

"నేనొకసారి వాటిని చూడొచ్చా" అన్నా.

"బంగారంగా, అవేమన్నా ముట్టుకుంటే కరిగిపోయేవా, పగిలిపోయేవా" అని వెనక్కి తిరిగి కిటికీలోంచి "ఒరే మల్లీ ఆ చెక్క బొమ్మలోసారి తీసుకురా" అని మేనల్లుడికి చెప్పాడు.

మల్లీనాథ్ ఒక కార్డుబోర్డు అట్టపెట్టె తెచ్చి మాముందు బల్లమీద పెట్టి "నువ్వా సూర్యం, ఎవరో అనుకున్నా, ఇందాకే రెవెన్యూ వాళ్లెవరో వచ్చి వెళ్లారు చూస్తూండు, టీ పట్టుకొస్తా" అంటూ లోపలికె వెళ్లాడు.

విశ్వమూర్తి అట్టపెట్టెతెరిచి ఒక్కొక్కటే తీసి దానిగురించి చెప్పి బల్లమీద పెడుతుంటే నాకు మతిపోయింది. అవన్నీ నాణ్యమైన టేకుచెక్కలో ఒక్క అతుకుకూడా లేకుండా చేసినవట, అతుకు లేకపోవడం చూపించాడు. అందులో రకరకాల పరిమాణాలున్న చెక్కలింకులతో చేసిన గొలుసులు, వలయాలుగాతిరిగే శంకులతో రుద్రాక్షమాలలు, నగలు దాచుకునే జారుతలుపులతో నగిషీపెట్టెల్లాంటివి ఉన్నాయి.

అన్నిటికంటే నాకు చూసినా నమ్మశక్యంకానిది ఒక చెక్కగొలుసుచివర ఆవుమెడలో వేసే మువ్వలాంటిది. అదే ఆకారం, అదే సైజు. మువ్వకిందిసగంలో అదే సన్నటి చీలిక, లోపల రేగుగింజంత చెక్కబంతి. దీనిక్కూడా ఎక్కడా అతుకు లేదు. కదిలిస్తే మువ్వలాగే గలగలా చప్పుడు. నేను అన్నివైపులా తిప్పిచూసి కళ్లప్పగించి చూస్తూండిపోయాను.

“యివన్నీ నిజంగా మీరే చేసారా? అతుకులేకుండా యిలాంటివి మనిషన్నవాడు చెయ్యగలడా?” అనడిగాను గొంతు పెగుల్చుకుని. అవన్నీ ఆయనే చేసాడని నాకు తెలుసు, ఐనా అడిగాను. అవి ఆయన ఎక్కడా ప్రదర్శించకపోవడం మరీ ఆశ్చర్యకరం.

"మన వీరాచారికి గణితం, కొంత ఫిజిక్సు, మెకానిక్సు నేర్పి అతనడిగినవి ఇచ్చిచూడు. ఇంతకంటే క్లిష్టమైనవికూడా చేస్తాడు. అతనే నాకు విద్యనేర్పి కొంత దారికూడా చూపాడు. మనపూర్వీకులు రాతిలో చేసారు, నేను చెక్కతో చెయ్యడంలో ఏముంది? మన కళాకారులను తక్కువచేసి వారసత్వవిద్యను మనం పోగొట్టుకుంటున్నాం" అన్నడాయన విచారంగా.

“మీరు అవార్డు యెందుకొద్దంటున్నారు? తీసుకుంటే యీవిద్య యింకా వెలుగులోకి వస్తుందిగదా” అన్నా.

"చేసినవాడు పండితుడైతే అది లోకానికొక వింతమాత్రమే" అని ఊరుకున్నాడాయన.

మల్లీనాథ్ ఆయనకు పాలు, నాకు టీ పట్టుకొచ్చాడు.

కాస్సేపు తరువాత ఒక గొప్ప అనుభవాన్ని పొందినట్టై నేను అచేతనంగా తిరిగొచ్చాను.

రాత్రి ఇదంతా మా ఆవిడ కామేశ్వరికి చెప్పాను. అంతావిన్న తరువాత “నేనవి యిదివరకే చూసాను, నీతో అంటే నువ్వు యేదో ధ్యాసలోవుండి పట్టించుకోలేదు. మీ సంఘపెద్దల్లాగే నువ్వూ యీ చెక్కశిల్పాలకు అంత ప్రాముఖ్యత యివ్వడంలేదేమో అనుకున్నా" అంది కనపడకుండా నవ్వి, ఎప్పటిలాగే మా సంఘంమీద చురకవేస్తూ.

ఆ మూడోరోజు మా సంక్షేమసంఘ సభ్యురాలు సుగుణమ్మయింట్లో సమావేశం జరిగింది. వాళ్లతోటలోంచి వచ్చిన తియ్యటి బొప్పాయి, సపోటా పళ్లముక్కలు తిన్నతరువాత ఈ విషయం ప్రస్తావనకు వచ్చింది.

"యేమైనా సంస్కృత పండితుడు దారుశిల్పాలు చెయ్యడం విచిత్రం" అన్నాడు నారాయణమూర్తి.

"అవన్నీ మనవేదాల్లోని విద్యలేగదా. ఆయనకు ఆసూత్రాలూ వాటిలో కనపడివుంటాయి" నమ్మకంగా చెప్పాడు స్వామినాయుడు.

"బంగారంతో చేయడానిక్కూడా అట్లాంటి సూపర్ డిజైన్లున్నాయేమో చూడమనాలి. ఆయనపేరు ఖండాలు దాటుతుంది" అన్నాడు బసవలింగం.

"యీవూర్లోనే సన్మానసభ పెడతామని, తామేవొచ్చి అవార్డిస్తామని ఆ సంస్థవాళ్లు కలెక్టరుద్వారా కబురంపిచ్చార్ట. అవార్డు వొకసారి ప్రకటించాక తిరస్కరించబడితే వాళ్లకు మాటొస్తుందని ఆ సంస్థవాళ్లు తీసుకోమని వొత్తిడి చేస్తున్నారట" చెప్పాడు రంగశాయి.

"ఐతే మనమెళ్లి మన సంఘం తరపున ఆయన్ని దీనికైనా వొప్పిద్దాం. ఆయన మనవీధివాడు, మనకూ యెంతోపేరొస్తుంది" సూచించాడు సోమయాజులు.

"అలాగైతే మన గుడిముందరే పెద్ద షామియానావేసి ఆ సభను మనమే యేర్పాటు చేద్దాం. భోజనాలు పెడదాం. మనవీధిలోనే అంటే విశ్వమూర్తి వొప్పుకుంటాడు. కలెక్టరొస్తాడంటే ఖర్చు భరించడానికి వూళ్లోని పెద్దలు ముందుకొస్తారు" బలపరిచాడు మునిరెడ్డి.

సరే అంటే సరే అనుకుని మావాళ్లు సమావేశం ముగించారు.

ఆ శనివారం సాయంత్రం నాక్లాస్మేటు, విశ్వమూర్తికొడుకు భారవి టౌన్నుంచి వచ్చాడని తెలిసి వెళ్లికలిసాను. ఇద్దరం నదివొడ్డుకెళ్లి రావిచెట్టుకింద చప్టామీద కూర్చున్నాం. చీకటి పడుతోంది. గుళ్లో గంటచప్పుడు వినబడుతూంది. నదిలోనీళ్లు పాయలుగా పారుతున్నాయి. నదికవతల మూసేసిన ఫ్యాక్టరీచుట్టూ అడవిలాగా పెరిగిన చెట్లనుంచి మావీధి మొదట్లోవున్న బురుజువైపు చల్లనిగాలి వీస్తోంది. గుడెదురుగావున్న రాయుడిగారి బంగళా మూడోఅంతస్తు చుట్టూవున్న కూజాల పిట్టగోడ గతకాలపు తాపీకళాకారులను తల్చుకుంటూ మౌనంగా చీకట్లోకి జారుతోంది.

"మీనాన్న చేసింది అద్భుతం. ఆయన అవార్డు తీసుకుంటే బావుంటుందిగదా" అన్నా.

"అయనకు అవార్డులు, సన్మానాలు పడవు. రాజులు పండితులను, కవులనూ బహుమతులతో తప్పుదారి పట్టించారంటాడు. ఆయన దాన్నొక సవాలుగా చేసాడు. చెయ్యడంతోనే ఆ తృప్తి ఆయనకు వచ్చేసింది" అన్నాడు భారవి.

"సవాలా?" అన్నా ఆశ్చర్యంగా.

“అదంతా పెద్ద కథ, వింటావా?” అని చెప్పడం ప్రారంభించాడు భారవి.

“రెండేళ్లకిందట మధ్యయుగపు శిల్పకళను చూడ్డానికి మానాన్న తనస్నేహితుడైన కాశీపండితుడు లలిత్ మిశ్రాతో హంపి, బేలూరు, వరంగల్లు ఇలాంటిచోట్లకి యాత్రకి వెళ్లాడు. ఒకచోట గర్భగుడి ద్వారంపైన అతుకులేకుండా రాతితో చేసిన గొలుసులు కనపడ్డాయిట.

'చూసావా, ఇప్పుడిలా చేయగలిగిన శిల్పులే లేరు' అన్నాట్ట లలిత్ మిశ్రా.

' నైపుణ్యంలో మనుషులు పైపైకే వెళ్తారు. అనుకోవాలేగాని ఒకమనిషి చేసిందేదైనా మరొకమనిషి చెయ్యగలడు. కొత్తతరంవాళ్లు పాతతరాలకంటే ఇంకా క్లిష్టమైనవి చేయగలరు. కొత్తవాళ్లకు ప్రోత్సాహం లేదుగాబట్టి అంతరించినట్టుగా కనబడుతుంది' అన్నాట్ట మానాన్న.

‘ఐతే ఇప్పటిశిల్పులు ఇవి చెయ్యగలరా' అని రెట్టించాట్ట మిశ్రా.

‘శిల్పులవరకూ ఎందుకు? పట్టుదల, ఓపిక, నేర్చుకునే తపన ఉండాలేగాని నువ్వూ, నేనూగూడా చేయగలం, ఈనాటి శిల్పులు ఇంకా గొప్పవి చెయ్యగలరు' అన్నాట్ట మానాన్న.

‘ఐతే నువ్వు చెయ్యగలవా? చేస్తే నీకు కాశీసభలో ఘనసన్మానం చేసి, అందరిముందూ నీ కాళ్లుమొక్కుతా. చెయ్యలేకపోతే మన పూర్వశిల్పులను అవమానించినందుకు అదే కాశీసభలో నువ్వు క్షమాపణ అడగాలి. సరేనా, చేస్తావా?' అని సవాలు చేసాడట లలిత్ మిశ్రా.

‘నాకు యాభైఆరేళ్లు. ఇప్పుడు నేర్చుకుని రాతిలోచేసే వయసుకాదు. చెక్కలో ఐతే మూడేళ్లలో చేస్తాను. నీ కాశీ సన్మానంకోసం కాదు. పాతతరాల కళాకారులను తక్కువజేయడం కోసం కానేకాదు. వాళ్లు మహానుభావులు. నేను చేస్తానంటున్నది వర్తమాన, భవిష్యత్తరాల మనుషుల సామర్థ్యాన్ని నిరూపించేందుకే' అని ఒప్పుకున్నాట్ట మానాన్న.

‘చెక్కైనా అలా చెయ్యడం అసాధ్యం. కాశీపండితుల్లో నీకున్న మంచిపేరంతా పోతుంది. బాగా ఆలోచించుకో' చివరగా చెప్పాట్ట మిశ్రా.

మా నాన్న నవ్వి 'అలాగే కానీ ' అన్నార్ట. ఇదిజరిగి రెండేళ్లైంది.

తిరిగిరాగానే మానాన్న మాయింట్లోనే ఔట్ హౌస్లోవున్న వీరాచారికి అంతాచెప్పి 'నువ్వే నాకు వడ్రంగం నేర్పి, అతుకులేని గొలుసులు ఎలాచెయ్యాలో చెప్పాలి' అనడిగాడు.

వీరాచారి నిర్ఘాంతపోయి 'నువ్వు చాలాతెగువతో ఒప్పుకున్నావు. ఇది దాదాపు అసాధ్యమైన పని. ఐతే నీ వాదం సరైందే. మాకు ప్రోత్సాహం లేకపోవడంవల్లనే తలుపులకి, కుర్చీలకి, పరిమితమైపోయాం. మిషన్లొచ్చి ఆ ఉన్నదికూడా పోతోంది. దారుశిల్పకళ అనేవిద్య దాదాపు అంతరించిపోయింది. అవన్నీ లెక్కలు, కొలతలు. నాకు కొన్నిసూత్రాలు చూచాయగా తెలుసు. అదీ అభిమన్యుడికి పద్మవ్యూహంలాగ కొంతవరకు మాత్రమే' అన్నాడు.

'అదే పదివేలు. నేను వెంటనే వడ్రంగంనేర్చుకోవడం మొదలుపెడతా. తరువాత ఎలా ముందుకెళ్లేది ఆలోచిద్దాం' అని చెప్పాడు మానాన్న.

'మా కళపైన నీకున్న నమ్మకాన్ని నిలబెట్టేదానికైనా నీవెనకే ఉంటాను' అని హామీ ఇచ్చాడు వీరాచారి.

“ఆ మరుసటిరోజే పనిముట్లు, టేకుచెక్క కొని పనినేర్చుకోవడం మొదలుపెట్టాడు మానాన్న. ఒక సంవత్సరంపాటు కష్టపడి మొదట వడ్రంగం నేర్చుకున్నాడు. మరో ఏడాది శ్రమపడి ఆ గొలుసులు, పెట్టెలు తయారుచేసాడు. ఇంకో మూణ్ణెల్లు రాత్రింబవళ్లు కృషి చేసి ఆ మువ్వ ఉన్న గొలుసు చేసాడు. నిజానికి సవాలు అతుకులేని గొలుసులవరకే. మువ్వ ఆయన అదనంగా సాధించాడు. అదీ కథ” అని దీర్ఘంగా నిట్టూర్చాడు భారవి.

నేను కొంతసేపు తరువాతగాని మాట్లాడలేకపోయాను.

"మరి వీరాచారికుటుంబం సంవత్సరంకిందటే టౌనుకు వెళ్లిపోయిందిగా" అన్నాను.

"ఔను, చెప్పడం మర్చిపోయాను. మానాన్న వడ్రంగం నేర్చుకున్నాక ఇద్దరూ కలసి అతుకుల్లేకుండా గొలుసులెలా చెయ్యాలో ప్రణాళికలు వేసుకుంటూండగా వీరాచారి జబ్బుపడ్డాడు. అతనికొడుకులు అతన్ని వైద్యంకోసం టౌనుకు తీసికెళ్లిపోయారు. మొదట్లో మా నాన్న హతాశుడయ్యాడు. తర్వాత తనే ప్లానులుగీసి నెలకోసారైనా టౌనుకొచ్చి ఒకట్రెండురోజులు నాదగ్గరేవుండి వీరాచారిని కలిసి చర్చించి వెళ్లేవాడు. ఆతరువాత వీరాచారి కోలుకున్నాడుగాని సత్తువలేక అక్కడే ఉండిపోయాడు"

"ఈ గొలుసులు, మువ్వ చూసి వీరాచారి చాలా సంతోషించివుండాలి" అన్నా.

"ఔను. ఆరోజు అతని ఆనందాన్ని వర్ణించలేం. తర్వాత లలిత్ మిశ్రా పరిస్థితికూడా అంతే. చాలాసేపు నోటమాట రాలేదు. మానాన్న కాళ్లు పట్టుకోబోయాడుగాని ఆయన మందలించాడు”

"మీ నాన్నపడిన శ్రమను మాటల్లో వర్ణించలేం" అన్నా

"మామూలు కష్టమా? ఒక్క శారీరకశ్రమే కాదు, ఎంతో మేధోశ్రమకూడా. లెక్కలు చేస్తూ ప్లాన్లుగీయడం, వాటిప్రకారం చెక్కతో పనిచెయ్యడం. అలసిపోయి నేలమీదే నిద్రపోయేవాడు. ఒక్కోసారి వేసుకున్న ప్లాన్లు పనిచేసేవి కాదు. అప్పుడు నిరాశకుగురై రెండుమూడురోజులు మౌనంగా ఉండిపోయేవాడు. అలాంటప్పుడు మా అమ్మ ధైర్యంచెప్పేది. మొత్తానికి ఎలాగో పూర్తిచేసాడు. మేమూ ఊపిరి పీల్చుకున్నాం" అన్నాడు భారవి లేచి. చీకటి చిక్కబడి అంతా సద్దుమణిగింది, ఇద్దరం ఇంటివైపు నడిచాం.

వారంతర్వాత మాయెదురింటి చలపతి నేను ఆఫీసునుంచి వస్తున్నప్పుడు కచేరి సత్రందగ్గర కలిసాడు. సత్రంపక్కన బిచ్చగాళ్లు రాళ్లపొయిలమీద వంటలు మొదలుపెట్టారు. నల్లని పొగ గాలిలోకి లేస్తోంది.

మేం మావీధిలోకి తిరిగి మాట్లాడుతూ నడుస్తూండగా విశ్వమూర్తి ప్రస్తావన వచ్చింది.

"ముందు అనుకున్నట్టుగానే మొన్న మనవీధిపెద్దలు విశ్వమూర్తి ఇంటికె ళ్లారు, నేనూ వెళ్లాను. అవార్డుకు ఒప్పుకోవాలని మనవాళ్లు రకరకాలుగా పట్టుబట్టారు. ఆ సంస్థవాళ్లు, కలెక్టరుపంపిన మనిషికూడా చివరిసారిగా అడిగారు. 'వొకషరతు మీదైతే సరే' అన్నాడు విశ్వమూర్తి" చెప్పాడు చలపతి.

"షరతా? యేంటది?"

"నాకు వడ్రంగం విద్యనేర్పి, గొలుసులు చెయ్యడంలో కొంతదారిచూపిన వీరాచారికీ నాకు కలిపి అవార్డుయిస్తే తీసుకుంటాను. అలాగైతేనే నేను యేమాశించి అవి చేసానో అదివెలుగులోకి వస్తుంది అన్నాడు విశ్వమూర్తి. కానీ మన సంఘ పెద్దలకు అది నచ్చలేదు. వీరాచారి దగ్గరికెళ్లి అడగడం వాళ్ల స్థాయికి తక్కువని వొదిలేసారు. ఆ సంస్థవాళ్లు వెళ్లి అడిగారుగాని కుదరలేదు. ఖేల్ ఖతం"

"యిందులో కుదరకపోవడం యేముంది?" అన్నాను.

"ఆత్మాభిమానం విషయంలో వీరాచారి మాత్రం తక్కువతిన్నాడనుకున్నావా? 'అ గొలుసులన్నీ విశ్వమూర్తే స్వంతంగా చేసాడు. నాకా లెక్కలవీ రావు. నేనతనికి వడ్రంగం మాత్రమే నేర్పాను, యేవో కొన్ని సూచనలు యిచ్చాను. దానికి నేను అవార్డు తీసుకోవడమేమిటి? ససేమిరా' అన్నాట్ట. అదీ సంగతి" అని ముగించి తెల్లబోయి చూస్తున్న నన్ను పట్టించుకోకుండా వాళ్లింటివైపు నడిచాడు చలపతి.

(మా బురుజ వీధి చెప్పిన మరోకథ వచ్చేనెలలో)

Post your comments